## నేడు రవీంద్రభారతిలో భాగ్యరెడ్డి వర్మ జయంతి

హిమాయత్‌నగర్ : సంఘ సంస్కర్త, దళిత జాతి విద్యావికాసం కోసం కృషి చేసిన మాదరి భాగ్యరెడ్డి జయంతి వేడుకలను నేడు రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఆది- హిందూ సోషల్ సర్వీస్ లీగ్ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ అమోలక్ శాస్త్రీ బుధవారం తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ దళితుల అభ్యున్నతికి కృషి చేశారని, జోగిని, దేవదాసి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్‌కు భాగ్యరెడ్డి వర్మ స్మారక జీవిత సాఫల్య పురస్కారం ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు.







# సుందరీకరణ పనులు పూర్తిచేయండి

## నల్లచెరువు కోసం నిధులు కేటాయింపు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 21 : నల్లచెరువు సుందరీకరణ వేగంగా చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. బుధవారం నల్లచెరువును హైడ్రా, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం కేటాయించిన నిధులతో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని.. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వర్షం నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేలా పైపులైన్ (రిటర్నింగ్ వాల్)నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షానికి సమీపంలోని కాలనీలో ముంపు సమస్యలు ఎదురయ్యాయని, అలాంటివిఇ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేయాలన్నారు. చెరువు సుందరీకరణ పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు నాగరాజు, చిన్నారెడ్డి, నిఖిల్ రెడ్డి, నాగప్రియ, ప్రసన్న పాల్గొన్నారు.



కూకట్‌పల్లి నల్లచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు




## శాశ్వత పరిష్కారం చూపాలి



ఎస్‌ఎన్‌డీపీ అధికారులతో మాట్లాడుతున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం

అల్లాపూర్, మే 21 : సున్నంచెరువు ఎగువ నుంచి మైసమ్మ చెరువు దిగువకు నాలా విస్తరణ పనులు వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం ఎస్‌ఎన్‌డీపీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈఈ శ్రీనాథ్ రెడ్డి, డీఈ రాజ్యలక్ష్మితో కలిసి కార్పొరేటర్ లక్ష్మీ నగర్, సర్దార్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ మీదుగా మైసమ్మ చెరువు లోకి ప్రవహించే నాలాను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముంపు సమస్య తలెత్తకుండా నాలా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## 'మెరుగైన వైద్యసేవలు అందాలి'



జిల్లా దవాఖానలో పర్యటిస్తున్న టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

కొండాపూర్, మే 21 : దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు పరిశుభ్రతమైన వాతావరణాన్ని కల్పించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానను సందర్శించారు. దవాఖానలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందజేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ చంద్రకృష్ణ ఉన్నారు.







### నేడు హనుమత్ జయంతి వేడుకలు

మియాపూర్ : హనుమాన్ జయంతి, షిర్డీ సాయిబాబా మందిర ద్వాదశ వార్షిక మహోత్సవం సందర్భంగా వివేకనంద నగర్ డివిజన్ పరిధిలోని బాగ్అమీర్ ఆలయంలో గురువారం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.



మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ లో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పవిత్రమైన ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం సంతోషంగా ఉందని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామం అమ్మవారి దయతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.




## క్వాలిటీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ మెంబర్‌గా హెచ్‌సీయూ ప్రొ. నాగరాజు



కొండాపూర్ : మెరుగైన విద్యా వ్యవస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ (టీఈసీ) ఏర్పాటు చేసిన 'క్వాలిటీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్' గ్రూప్ వర్కింగ్ మెంబర్‌గా హెచ్‌సీయూ సోషియాలజీ విభాగం హెడ్ ప్రొ. నాగరాజు నియమితులైనట్లు వర్సిటీ యాజమాన్యం తెలిపింది. నాగరాజు ఎడ్యుకేషన్ ఫీల్డ్‌లో కనబర్చిన ప్రతిభ, సేవలను గుర్తించి పదవిని అప్పగించారని, వర్కింగ్ గ్రూప్ సభ్యులుగా ప్రొ. శాంతసిన్హా (రిటైర్డ్), ప్రొ. రేఖ పప్పు, బీ శేషుకుమారి ఉన్నారని తెలిపారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 21: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు ( కేజీ – రూపాయలు) కింది విధంగా ఉన్నా యి. టమాట 15, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 35, కాకర 32, బీర 45, క్యాబేజీ 13, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 26, కాలీఫ్లవర్ 18, దొండ 19, చిక్కుడు 45, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలు 25, కీర 23, దోసకాయ 18, సోరకాయ 12, పొట్లకాయ 13, కందగడ్డ 50, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 16, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9నుంచి 11, చామ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 26, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ (1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9 : 30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## ఉన్నత స్థాయికి ఎదగాలి



వ్యవసాయ యూనివర్సిటీ, మే 21: రాజేంద్రనగర్ మానసహిల్స్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖచే నిర్వహించబడుతు ఉచిత రెసిడెన్షియల్ పద్ధతిలో ఎస్సీ,ఎస్టీ , బీసీలకు యూపీఎస్ సి శిక్షణా ముగిసింది. మెరుగైన వసతికై లెక్టర్న్ పోడియం, వాల్ మౌంటెడ్ ప్యాన్,లైబ్రరీకి రొటేటింగ్ మ్యాగజైన్ స్టాండ్ ను అమెరికా గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ అధ్యక్షులు శ్రీ నవీన్ బత్తిని, చైర్మన్ శ్రీ నవీన్ ఉజ్జిని, సాంస్కృతిక కార్యదర్శి శ్రీమతి జ్యోత్స్న పాలకుర్తి గేట్స్ సహకారంతో విద్యార్థుల సమక్షంలో సంస్థ ప్రిన్సిపాల్ డా. పి. శారద అందజేశారు. కార్యక్రమంలో జి. రాధిక , శ్రీ శోభన్, సరోజ , పద్మ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి విస్తరణలో..ఎడతెగని జాప్యం



దారి వెడల్పు పనులకు ఇబ్బందికరంగా మారిన చెట్టు

### హఫీజ్‌పేట నుంచి కొండాపూర్ నడుమ ఇరుకుగా మారిన రహదారి

### ఏడాదిగా సీఆర్ ఫౌండేషన్ వద్ద కొనసాగుతున్న దారి వెడల్పుపనులు

మియాపూర్, మే 21 : కీలకమైన ఐటీ ప్రాంతంలో రహదారుల విస్తరణ పనుల్లో ఆయా శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో జాప్యం జరుగుతున్నది. ట్రాఫిక్ వలయంలో వాహనదారులు చిక్కుకుంటున్న నేపథ్యంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు. బల్దియా అనుబంధ విభాగాలే అయినప్పటికీ పనుల నిర్వహణలో ఎడతెగని జాప్యంతో ఎందుకు జరుగుతున్నదని వాపోతున్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని హఫీజ్‌పేట్ – గచ్చిబౌలి దారిలో సీఆర్ ఫౌండేషన్ సమీపంలో రహదారి విస్తరణ పనులకు ఏడాదికి పైగా మోక్షం కలుగడం లేదు. ఈ దారిలో 400 మీటర్ల మేర ఫుట్‌పాత్, దానిపై పెద్ద సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అదే ప్రాంతంలో లింక్ రహదారి, కొండాపూర్ ఆర్టీవో కార్యాలయం, కొత్తగూడ ఫ్లైఓవర్ ఎక్కేందుకు అనుసంధాన దారి, మరోపక్క యూటర్న్ ఉండడంతో ట్రాఫిక్ కష్టాలు తీవ్రం అవుతున్నాయి. ఫుట్‌పాత్‌పై చెట్ల తొలగింపు పనులను ఏడాది క్రితం ప్రతిపాదించారు. అధికారులు సింహభాగం పనుల నిర్వహణలో జాప్యం చేస్తున్నారు.

### ట్రాఫిక్ అంతరాయం నివారించవచ్చు..

ఈ పనులు పూర్తి అయితే ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించవచ్చని ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారులను పలుమార్లు కోరుతూ వస్తున్నారు. ఫుట్‌పాత్ మీద ఉన్న 40కి పైగా చెట్లు, 10 వరకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అదే ప్రాంతంలో తాగునీటి చాంబర్ ఉండడంతో ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. బల్దియాలోని కమిటీ సైతం చెట్ల తొలగింపు అంశాన్ని 15 రోజుల క్రితం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కమిటీ నివేదిక అందాల్సి ఉన్నది. మరోపక్క ఈ దారిలో విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పునకు సంబంధించి ఎలక్ట్రికల్ విభాగం అధికారులు రెండు దఫాలుగా పరిశీలనలు పూర్తి చేసినా.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. చెట్లను నల్లగండ్ల ప్రాంతంలో ట్రాన్స్ లొకేట్ చేసేందుకు యూవీడీ విభాగం ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నది. కమిటి నివేదిక, ఎలక్ట్రికల్ విభాగం ద్వారా విద్యుత్ స్తంభాల మార్పు ప్రక్రియను పూర్తిచేస్తే కానీ యుద్ధ ప్రాతిపదికన రహదారి విస్తరణ పనులను చేపట్టేందుకు చందానగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సిద్ధంగా ఉన్నారు.



కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ దారిలో ఉన్న చెట్లను పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు, అధికారులు

### నిధులు సైతం మంజూరైనాయి..

నిధులు సైతం మంజూరు కాగా.. అప్పటి జడ్సీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ యశోద దవాఖాన ఎదుట విస్తరణ పనులను ఎట్టకేలకు పూర్తి చేశారు. అదే ఉత్సాహం కొండాపూర్ రహదారి విస్తరణలో చూపక పోవడంతో ప్రజలు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు కానా మేట్ రహదారి విస్తరణను సైతం చేపట్టాల్సి ఉన్నట్లుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారాలు దృష్టి కేంద్రీకరించి ఆయా విభాగాల మధ్య నెలకొన్న సమన్వయ లోపాన్ని పరిష్కరించి రహదారి విస్తరణను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

## సీఐ నరసింహరాజుకు ప్రశంసా పత్రం



బాలానగర్ : ఉత్తమ ఎస్‌హెచ్‌ఓగా ఎంపికైన బాలానగర్ సీఐ నరసింహ రాజుకు డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రం, నగదు పురస్కారం అందజేశారు. బుధవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ బాలానగర్ సీఐని అభినందించారు. సీఐ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. నేరాల నియంత్రణకు కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు.

## ఓ వైపు అక్రమ నిర్మాణాలు.. చోద్యం చూస్తున్న అధికారులు

దుండిగల్, మే 21 : అధికారుల పర్యవేక్షణ లోపం, కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. కొందరు తమ భవనాల నిర్మాణం కోసం మున్సిపాలిటీ నుంచి జి+2 అంతస్తులకు అనుమతులు తీసుకొని ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మరికొందరు ఏకంగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందకుండానే నిర్మాణాలు చేపట్టడం చూస్తుంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అంటున్నారు స్థానికులు. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట, సింహపురి కాలనీలో ఇటీవల అక్రమ నిర్మాణాల సంఖ్య పెరిగిపోతుందనీ స్థానికులు వాపోతున్నారు. భవిష్యత్‌లో మౌలిక వసతుల కల్పన సైతం మునిసిపాలిటీకి ఇబ్బందికరంగా మారే పరిస్థితులు ఉన్నా అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వ్యక్తి 380 గజాల్లో బహుళ అంతస్తుల భవనం నిర్మించేందుకు టీఎస్ బిపాస్ కింద జీ +2 అంతస్తులకు అనుమతులు తీసుకొని ఏకంగా 5 అంతస్తులు నిర్మించాడు. అది చాలదన్నట్లు మళ్లీ పెంట్‌హౌస్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



అనుమతులకు మించి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం



శామీర్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఎస్‌వో శ్రీనివాస్ రెడ్డి

## 7211 టన్నుల ధాన్యం సేకరణ

మేడ్చల్, మే 21: జిల్లాలో ఏర్పాటు చేసి న 14ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 7211.440 టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపా రు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, అలియాబాద్, జగన్‌గూడ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7211.4 40 టన్నుల ధాన్యాన్ని 1055మంది రైతు ల నుంచి 6133.680 టన్నుల దొడ్డు రకం ధాన్యం, 261 మంది రైతుల నుంచి 1077.760 టన్నుల సన్నకరం ధాన్యం కొనుగోలు చేశామన్నారు. లక్ష్యం మేరకు కొనుగోలు కేంద్రాల్లో తగినంత హమాలీలను ఏర్పాటు చేయాలని కొనుగోలు కేం ద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతు లు తీసువచ్చే ధాన్యంలో ప్రమాణాల ప్రకారం తేమ ఉండాలని, తాలు, మట్టి పెళ్లలు లేకుండా చూసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ప్రమాణాల మేరకు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## నేషనల్ ఆర్చరీకి రాంపల్లి యువకుడు ఎంపిక

**మేడ్చల్ కలెక్టరేట్, మే 21:** నేషనల్ జడ్జెస్(రిఫరీ) ఆర్చరీకి నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ ఎంపికయ్యారు. ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు బెంగళూరులో ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ ఆర్చరీ జడ్జెస్ (రిఫరీ)సెమినార్‌కు రాష్ట్రం నుంచి పది మంది పాల్గొన్నారు. ఈ మేరకు ఈనెల 20న వచ్చిన ఫలితాల్లో ముగ్గురు ఎంపికయ్యారు. రాంపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ ఎంపిక కావడంతో గ్రామస్తులు అభినందించారు. భానుచందర్ ప్రస్తుతం కాప్రాలో అకాడమీ, రిక్వ్యాల్ఫోర్డ్ ఇంటర్ నేషనల్ స్కూల్ రాంపల్లి ఆర్చరీ కోచ్‌గా పనిచేస్తున్నాడు.